క్లుప్తంగా

వేగంగా రోడ్డు విస్తరణ పనులు


బస్తిపాడు-చిన్నటేకూరు రోడ్డు విస్తరణ పనులు

కల్లూరు: బస్తిపాడు నుంచి చిన్నటేకూరు ఆర్ అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఓర్వకల్లు మండలం నన్నూరు నుంచి తడకనపల్లె, చిన్నటేకూరు, బస్తిపాడు మీదుగా కె. నాగలాపురం ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును విస్తరించాలని ఆయా గ్రామల ప్రజల నుంచి వినతుల మేరకు గత ప్రభుత్వం హయాంలో అధికారులు ప్రతిపాదనలు పంపారు. కొద్ది రోజులుగా బస్తిపాడు నుంచి చిన్న టేకూరు రోడ్డుకు ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి.

నేడు కోన వెంకన్న ఆలయంలో విశేష పూజలు



సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. స్వామివారికి బ్రహ్మోత్సవాలు నిర్వహించి మూడు నెలలు పూర్తయిన నేపథ్యంలో మూడు నెలలసేవ పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా కొండపై ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించనున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


తడకనపల్లె సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

కల్లూరు: గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తడకనపల్లె గ్రామ సచివాయలంలో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. సకాలంలో విధులకు హాజరు కాని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఐదుగురు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ముందస్తు అనుమతి లేకుండా విధులకు హాజరు కాకున్నా, ప్రజలకు సేవలు అందించడంలో విఫలమైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఓఆర్డీ రవికిషోర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


మాట్లాడుతున్న సర్పంచ్ భాగ్యరత్న

కోడుమూరు రూరల్: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోడుమూరు సర్పంచ్ భాగ్యరత్న సూచించారు. శుక్రవారం కోడుమూరులో గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్యం-పోషకాహార కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో వీధులను శుభ్రం చేయించడంతో పాటు, పరిశుభ్రమైన మంచినీటిని అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా తమ వంతుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోడుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు ఉమాభాయి, కమాల్ సాహెబ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడుమూరు రూరల్: గూడూరు సబ్ డివిజన్ పరిధిలోని కోడుమూరు, కొత్తకోట, గూడూరు 33కేవీ ఫీడర్లకు మరమ్మతులు, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ సబ్ స్టేషన్లలో మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈఈ జేసస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, వ్యాపారులు, రైతులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

సేంద్రియ సాగు.. లాభాలు బాగు

వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైంది. వాటి ధరలు ఎక్కువగా ఉండడంతో పెట్టుబడి రెట్టింపు అవుతోంది. భూమి నిస్సారం అవుతోంది. ఏటా దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. పంట ఉత్పత్తుల్లో క్రిమినాశిని అవశేషాలు వెలుగు చూస్తున్నాయి. దీని కారణంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. సేంద్రియ సాగుకు ప్రభుత్వాలు కూడా ప్రోత్సాహం అందిస్తున్నాయి.



- రసాయన ఎరువు, పురుగు మందులతో పెట్టుబడి రెట్టింపు
- సేంద్రియ, ప్రకృతి సేద్యంతో పెట్టుబడి ఆదా
- ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు
- కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సూచనలు

కర్నూలు (అగ్రికల్చర్): పంట సాగులో రసాయన ఎరువుల వినియోగం వల్ల లాభాల కంటే నష్టాలే అధికంగా ఉంటాయి. భూమిలో పంటల ఎదుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు చనిపోతాయి. భూమి సారం కోల్పోతుంది. పర్యావరణానికి కూడా హానికరం. ఈ ఉత్పత్తులను తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై కూడా త్రీవ ప్రభావం చూపుతుంది. అదే సేంద్రియ సాగుతో ఇలాంటి నష్టాలు లేవీ ఉండవు. నేల ఉత్పాదకత, భూసారం నిలకడగా ఉంటాయి. పంటలో నాణ్యత పెరుగుతుంది. పెట్టుబడులు తగ్గుతాయి. ఆరోగ్యకర ఉత్పత్తులు పొందవచ్చు. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో సుతస్థిరత తీసుకురాడానికి కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలు రెడ్డి సూచనలు..

సేంద్రియ వ్యవసాయం వల్ల లాభాలు

☛ నేల, నీరు, వ్యవసాయ ఉత్పత్తులు కాలుష్యానికి గురికావు. సేంద్రియ జీవన ఎరువుల వినియోగం పెరగడం వల్ల మొక్కకు అవసరమైన ఉప సూక్ష్మపోషకాలు తగు మోతాదుల్లో లభ్యమవుతాయి. చీడ పీడల తాకిడి తగ్గుతుంది.

☛ ఆరోగ్యానికి, పరిసరాల మిత్రత్వానికి, కాలుష్య నివారణకు దోహదపడుతుంది. జీవ వైవిధ్యానికి నాంది పలుకుతూ జన్యు వైవిద్యం ఏర్పడుతుంది.

-సహజ వనరులు నాశనం కాకుండా రాబోయే తరాల వారికి కూడా అందుబాటులో ఉంటాయి. నేల, మొక్కలు, జంతువులు ఒకదానికొకటి పరిసరాలకు అనుగుణంగా ఉంటాయి. నేల గుల్లబారుతుంది. మురుగు నీరు పోయే సౌకర్యం పెరుగుతుంది. నేలలో తేమ, గాలి, మొక్క సంబంధాల్లో అనుకూలత ఏర్పడుతుంది.

☛ నీరు పట్టి ఉంచుకునే శక్తి పెరుగుతుంది. వేర్లు బాగా భూమిలోకి చొచ్చుకుని పోయే లక్షణం కలిగి ఉంటుంది. భౌతిక లక్షణాలు వృద్ధి చెందుతాయి. మొక్కకు పోషకాలు బాగా అందుబాటులోకి వస్తాయి. నేలకు వాటిని పట్టి ఉంచుకునే గుణం పెరుగుతుంది. వ్యవసాయ సుస్థిరత పెరుగుతుంది. సురక్షిత ఆహారం లభిస్తుంది.

☛ ఆహారంలోకి విషపదార్థాలు ప్రవేశించే అవకాశం ఉండదు. ఖరీదైన పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు. నేల ఉత్పాదకత, భూసారం నిలకడగా ఉంటాయి. పంటలో నాణ్యత పెరుగుతుంది.

యాజమాన్య పద్ధతులు

☛ సేంద్రియ వ్యవసాయానికి గోవుల పేడ, వేప ఆవశ్యకం తోడుగా అవసరమైన మేరకు దున్నడం, నేల కోతకు గురికాకుండా జాగ్రత్త పడడం, నేల-నీటి సంరక్షణ చర్యలు, వ్యవసాయంలో పశుపోషణకు ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యం.

☛ పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలి. అనువైన అంతర పంటలు వేయాలి. పచ్చిరొట్ట పైర్లకు, పచ్చి ఆకు రొట్టకు ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా ఉపయోగించడం కీలకం.

☛ పూర్తిగా కుళ్లిన సేంద్రియ ఎరువుల వాడకం, పరిశుభ్రమైన సాగు, సకాలంలో కలుపు నివారణ జరగాలి. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు విరివిగా వాడడం ముఖ్యం. సాగునీటి యాజమాన్యంపై దృష్టి పెట్టాలి. రసాయనాలు వాడకుండా సహజ వనరుల ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవాలి. జీవ నియంత్రణ పద్ధతులు, వృక్షసంబంధ మందులకు ప్రాధాన్యత ఇవ్వాలి.

అంతరపంటలతో కలిగే లాభాలు

సాధారణంగా రైతులు ఒక సీజన్‌లో ఒకే పంటను సాగు చేస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడల బెడద వల్ల పంట దెబ్బతింటే రైతులు ఆర్థికంగా నష్టపోతారు. సరైన ప్రణాళిక, అవగాహనతో రెండు లేదా మూడు పంటలను ఒకేసారి సాగు చేయవచ్చు. రెండుగాని అంతకన్నా ఎక్కువ పంటలను ఒక నిర్దిష్టమైన నిష్పత్తిలో సాగు చేస్తే వాటిని అంతరపంటలు అంటారు. ఆ అంతర పంటల క్రమంలో ఒకటి ప్రధాన పంట, రెండు అంతకంటే ఎక్కువ పంటలు అయి ఉండాలి. రైతులు వ్యవసాయంలో సుస్థిరత కోసం సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టడంతో పాటు అంతర పంటలు సాగు చేయాలి.

తగ్గిన రసాయన ఎరువుల వినియోగం

కర్నూలు జిల్లాలో 2023-24 సంవత్సరంలో రసాయన ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గింది. 2022-23 ఏడాదితో పోలిస్తే 2023-24లో 65,306 టన్నుల ఎరువుల వాడకం తగ్గడం విశేషం. 2021-22లో ఎరువుల వినియోగం 2,44,849 టన్నులుగా ఉంది. 2022-23 ఖరీఫ్‌లో 1,71,575 టన్నులు, రబీ సీజన్‌లో 1,01,544 సహా మొత్తం 2,73,119 టన్నుల ఎరువులను వినియోగించారు. 2023-24 ఖరీఫ్, రబీ సీజన్‌లలో మొత్తం 2,07,815 టన్నుల రసాయన ఎరువులు వాడారు. 2021-22 సంవత్సరంతో పోలిస్తే 28,270 టన్నులు, 2022-23తో పోలిస్తే 65.306 టన్నుల ఎరువుల వాడకం తగ్గింది. 2024-25 ఏడాదిలో 3 నుంచి 5 శాతం రసాయన ఎరువుల వాడకం తగ్గించే దిశగా వ్యవసాయశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది.

డయేరియాతో జాగ్రత్త

-ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మీ

గడివేముల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీరు కలుషితమై డయేరియా ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా గడివేముల బీసీ కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. అన్నం తినే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. వాంతులు, విరేచనాలు అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చూపించుకోవాలన్నారు. మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. ఇళ్లలోని తొట్టెలు, కుండీల్లోని నీటిని రెండు రోజులకోసారి మార్చాలని, ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు. కొబ్బరి బోండాలు, వాడని ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలన్నారు.

16న మండల మీట్

పాణ్యం: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా శాఖల నివేదికతో హాజరుకావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. శుక్రవారం సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఇతర నాయకులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

- గ్రామాల్లో ప్రారంభమైన వేడుకలు
- చావిడీల్లో కొలువుదీరిన పీర్లు
- ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్న పోలీసులు


సి.బెళగల్‌లోని పెద్దదేవుడి మసీదులో కొలువైన పీర్లు


గొల్లలదొడ్డిలో కొలువైన పీర్లు


కోడుమూరు: కోటవీధిలో కొలువుదీరిన పీర్లు

సి.బెళగల్: మండలంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. కులమతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా ఈ పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. సి.బెళగల్, గొల్లలదొడ్డి, ఇనగండ్ల, చింతమానుపల్లె, బురాన్‌దొడ్డి, పోలకల్, కంబదహాల్ తదితర గ్రామాల్లో పీర్లను ప్రతిష్టించారు. శని, ఆదివారం నుంచి మూడు రోజుల పాటు సరిగెత్తు కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ నెల 17వ తేదీ మొహర్రంతో ముగియనున్నాయి. ఈ వేడుకల్లో హిందూ, ముస్లింలు కలిసి పీర్ల చావిడీల్లో పూజలు చేస్తారు. మండలంలో జరిగే మొహర్రం వేడుకలకు జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున వచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు. సి.బెళగల్‌లోని చిన్న ఇమాంఖాశీం, కొత్త కొండలయ్య, పాత కొండలయ్య, జీవులయ్య, మిన్నెల్ల స్వామివార్లకు ఓర్వకల్లు, గూడూరు, బళ్లారి, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు. గొల్లలదొడ్డిలోని చందమామయ్యకు వర్కూరు, ఆదోని, మాన్‌దొడ్డి, కర్నూల్, ముడుమలగూర్తి ప్రాంతాల నుంచి వచ్చి పూజలు చేస్తుంటారు. ఇనగండ్లలోని పెద్దయ్య, బడేసావ్ స్వామి వారికి ఆత్మకూరు, నంద్యాల, ఉయ్యలవాడ ప్రాంతాల భక్తులు దర్శించుకోనున్నారు.

కార్యక్రమాల వివరాలు

సి.బెళగల్‌లో శనివారం రాత్రి భక్తులు మొక్కులు చెల్లించి, ఆదివారం తెల్లవారుజామున కొండలయ్య సరిగెస్తు నిర్వహిస్తారు. అదే రోజు (ఆదివారం) రాత్రి చిన్న సరిగెస్తు వేడుకలు నిర్వహిస్తారు. సోమవారం వేకువజామున సి.బెళగల్‌లోని చిన్న ఇమాం ఖాశీం, గొల్లలదొడ్డిలో చందమామకు మొక్కులు చెల్లించుకోనున్నారు. ఇందు కోసం పీర్లను నిర్వాహకులు సిద్ధం చేశారు. ఈ పీర్ల సరిగెస్తు మండలంలో ప్రత్యేకమైంది. మంగళవారం సాయంత్రం పెద్దసరిగెస్తు జరగనుంది. బుధవారం వేకువజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు పీర్లను ప్రత్యేక అలంకరణలతో గ్రామాల్లో ఊరేగించనున్నారు. అదే రోజు సాయంత్రం పీర్ల చావిడీల నుంచి పీర్లను ఊరేగింపుతో ఏటికి (ఊరి చివరకు) తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారు.

కోడుమూరు రూరల్: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంలోని కోటవీధి, చిన్న బోయవీధి, మోబిన్‌వీధుల్లో 9 చోట్ల పీర్లదేవుళ్లు కొలువుదీరారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14వ తేదీ ఆదివారం చిన్న సరిగెత్తు, 16వ తేదీ మంగళవారం పెద్ద సరిగెత్తు, 17న బుధవారం పీర్లదేవుళ్లు ఏటికి వెళ్లడంతో మొహర్రం ఉత్సవాలు ముగుస్తాయని కోటవీధి పీర్లచావిడి నిర్వాహకుడు నాయబ్ ఖాజామోద్దీన్ తెలిపారు. మండలంలోని వర్కూరు, పులకుర్తి, కల్లపరి, వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి, అనుగొండ గ్రామాల్లోని పీర్లచావిళ్లల్లో పీర్లను కొలువుదీర్చారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మండలంలో మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇందు కోసం ఇప్పటికే ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించాం. పీర్లు ఏర్పాటు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశాం. గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో బందోబస్త్ ఏర్పాటు చేశాం. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

-ఎస్ఐ తిమ్మారెడ్డి

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ మంజులబాయి, డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్

కర్నూలు(హాస్పిటల్): మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణం పరిరక్షించబడుతుందని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆసుపత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగం వద్ద ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెరగడం వల్ల క్యాంపస్‌లో పచ్చదనం సంతరించుకుంటుందని, వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని చెప్పారు. ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ డే సందర్భంగా 50 మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ఆసుపత్రి ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడాలంటే మరిన్ని మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ మంజులబాయి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌చంద్రమౌళి, క్యాన్సర్ హెచ్ఓడీ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఈలకు అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): ఇటీవల నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న డీఈఈ గోపాల్‌కృష్ణను ప్రభుత్వం సరెండర్ చేసింది. దీంతో ఆయన పర్యవేక్షణ చేస్తున్న విధులను నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఇరువురు డీఈఈలకు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని 10, 11 వార్డులు, అలాగే 30 నుంచి 32 వార్డులకు సంబంధించిన అభివృద్ధి పనులను డీఈఈ డీవీ కృష్ణలతకు, 26 నుంచి 29 వార్డుల్లోని పనుల పర్యవేక్షణను డీఈ సి.నరేష్‌కు కేటాయించారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

- వచ్చే నెల 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం
- వీహెచ్ఎస్ఎన్‌సీ తనిఖీలో డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, పిల్లలకు అందించే పోషకాహారంపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం గార్గేయపురం గ్రామంలో జరుగుతున్న గ్రామీణ ఆరోగ్య పారిశుద్ధ్య పోషకాహార కమిటీ(వీహెచ్ఎస్ఎన్‌సీ) మీటింగ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెండో శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల్లో అన్ని వీహెచ్ఎస్ఎన్‌సీ కమిటీల్లో మీటింగ్ నిర్వహించాలన్నారు. కమిటీలోని సభ్యులైన సర్పంచ్, స్కూల్ టీచర్, పంచాయతీ సెక్రటరీ, ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది, స్కూల్ టీచర్, ఇంజినీర్, గర్భిణులు, బాలింతలు, స్వయం సహాయక సిబ్బంది, గ్రామ ప్రజలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది ఉంటారన్నారు. ఈ కమిటీ సభ్యులు ఆ సమావేశంలో ఆరోగ్య కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆ నెలలో చేయాల్సిన కార్యక్రమాల గురించి చర్చిస్తారన్నారు. ఆరోగ్య కార్యక్రమాలను ప్రణాళిక వేసి అమలు పరచాలన్నారు. ప్రభుత్వం ఒక్కో వీహెచ్ఎన్ఎస్‌సీ కమిటీకి సంవత్సరానికి రూ.10వేల చొప్పున బడ్జెట్ ఇస్తుందన్నారు. ఆ బడ్జెట్‌ను ఆ గ్రామాభివృద్ధికి ఉపయోగించాలన్నారు. వచ్చే నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలో గృహ సందర్శనాలు చేసి వారికి డయేరియా వ్యాధిపై అవగాహన కల్పించి, ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంట్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. పిల్లల తల్లిదండ్రులకు తల్లిపాల ప్రాముఖ్యత, చేతుల పరిశుభ్రత, ఓఆర్ఎస్ ప్యాకెట్ల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మి, సర్పంచ్ సోమేశ్వరమ్మ, డీసీఎం ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ, పంచాయతీ సెక్రటరి పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు (టౌన్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. శుక్రవారం డ్రైడేను పురస్కరించుకొని నగరపాలక మలేరియా విభాగం అధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని, వ్యర్థాలను తొలగించారు. దోమల వ్యాప్తి అరికట్టేందుకు పిచికారీ చేశారు. అనతరం కమిషనర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో హైపో క్లోరేట్ పిచికారీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ గేట్ వద్ద రహదారి విస్తరణకు లైన్ క్లియర్


మెడికల్ కళాశాల గేట్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరంలో బుధవార పేట మెడికల్ కళాశాల గేటు వద్ద రహదారి విస్తరణ పనులకు లైన్ క్లియర్ అయిది. ఇక్కడ రహదారి మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగులు ఉండాలి. అయితే మెడికల్ కళాశాల గేటు వద్ద 209 సర్వే నెంబర్‌లో 100 అడుగులు మాత్రమే రోడ్డు ఉంది. ముందు షాపులు ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ సమీక్ష సమావేశంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న దుకాణదారులతో మాట్లాడారు. మలుపు ఇబ్బందులు తొలగలంటే 7 షాపులు తొలగించాల్సి ఉంటుందన్నారు. విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయం మార్గాలు చూపి న్యాయం చేయాలని కమిషనర్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్యారాణి, ఏసీపీ రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కల్పించి వలసలు ఆపండి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం కింద అన్ని గ్రామాల్లో పనులు కల్పించి వలసలు నిరోధించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు జిల్లా నీటినీటి యాజమాన్య సంస్థ అధికారులను కోరారు. శుక్రవారం డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి, ఉపాధి సిబ్బంది ఎంపీని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల గురించి ఆరా తీశారు. భూగర్భ జలాలు, జలసంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా అధికారులకు సూచించారు. వలసల నివారణకు అడిగిన వారందరికీ స్థానికంగా పనులు కల్పించాలని తెలిపారు. గిట్టుబాటు కూలీ వచ్చేలా చూడాలన్నారు. ప్రస్తుతం పండ్లతోటల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ ఏడాది దాదాపు 7,470 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా తీసుకున్నట్లు తెలిపారు.

శ్రీరామ జన్మభూమి మందిరం స్టాంపుల ఆవిష్కరణ


శ్రీరామ జన్మభూమి మందిర స్మారక తపాలా స్టాంపులను ఆవిష్కరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): శ్రీరామ జన్మభూమి మందిరం స్మారక తపాలా స్టాంపులను శుక్రవారం నగర మేయర్ బీవై రామయ్య, కమిషనర్ భార్గవ్‌తేజ ఆవిష్కరించారు. స్థానిక నగరపాలక కార్యాలయంలో మేయర్, కమిషనర్‌లను వారి చాంబర్‌లలో తపాలాశాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. తపాలశాఖకు చెందిన ఆధార్, పాస్‌పోర్టు సేవలు, జీవిత బీమా, ప్రమాద బీమా తదితర పథకాల గురించి వారితో చర్చించారు. కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు సీనియర్ మేనేజర్ ఎం. అజిజుద్దీన్, కర్నూలు ప్రాంతీయ పోస్ట్ ఆఫీసు సూపరింటెండెంట్ జనార్ధన్ రెడ్డి, పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్ట్రక్టర్ మాదన్న పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహమ్మద్ ఇస్మాయిల్ (52)చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. పాతబస్తీకి చెందిన ఈయన గౌండ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అదే కాలనీకి చెందిన మహబూబ్ బాషాతో కలిసి ఇ.తాండ్రపాడులో గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వస్తూ తుంగభద్రనది బ్రిడ్జిపై ప్రమాదానికి గురయ్యాడు. మహబూబ్ బాషా వాహనం తోలుతుండగా మహమ్మద్ ఇస్మాయిల్ వెనుక కూర్చున్నాడు. పంచలింగాల వైపు నుంచి కర్నూలుకు వస్తున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీకొనడంతో ఇరువురూ కింద పడ్డారు. మహమ్మద్ ఇస్మాయిల్‌కు తలకు బలమైన గాయమైంది. అదే ఆటోలోనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కోలుకోలేక అదేరోజు అర్ధరాత్రి మృతి చెందాడు. ఈయనకు భార్య శంషాద్, ఒక కొడుకు, కూతురు సంతానం. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి

జిల్లా మహిళ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతల ఆందోళన

కర్నూలు(అగ్రికల్చర్): నెల వ్యవధిలోనే మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని జిల్లా మహిళ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ముచ్చుమర్రి గ్రామంలో అభం, శుభం తెలియని బాలికను రేప్ చేసి హత్యచేయడం దారుణమన్నారు. సభ్యసమాజం తలదించుకోవాల్సిన సంఘటనగా అభివర్ణించారు. శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, వ్యవస్థాపకురాలు జ్ఞానేశ్వరమ్మ, గౌరవ అధ్యక్షురాలు మాధవీ శ్యామల, సెక్రటరీ విజయ విలేకర్లతో మాట్లాడారు... నెల రోజుల వ్యవధిలోనే మహిళలపై అఘాయిత్యాలు, దౌర్జన్యకాండ వంటి ఘటనలు 8 వరకు జరిగాయని పేర్కొన్నారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన మైనర్ యువకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. సరైన వసతులు లేకుండా కోచింగ్ సెంటర్లను నడుపుతున్నారన్నారు. కర్నూలు నగరంలో 14 ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు ఉన్నాయని, వాటిలో పని చేసే ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలన్నారు.